క్లుప్తంగా

ఆలయానికి పల్లకీ అందజేత



ఆలయ నిర్వాహకులకు అందజేస్తున్న సభ్యులు

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం సభ్యులు 40వేల విలువ గల పల్లకిని బుధవారం అందజేశారు. గ్రామంలో నిర్వహించే పల్లకీసేవలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో అందజేసినట్లు వారు తెలిపారు. దైవకార్యాలకు ఉపయోగపడే పల్లకీ అందజేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు విఘ్నేశ్, రాఘవేందర్, శేఖరయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, శంకరయ్య, శేఖర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బీరప్ప ఉత్సవాలు



దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బీరప్ప ఉత్సవాలు బుధవారం మహా మంగళ హారతితో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్, బీరప్ప సంఘం నాయకుడు రవి దంపతులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నక్కలపల్లి గ్రామంలో బీరప్ప ఉత్సవాలను అందరూ కలిసి వైభవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి ఉత్సవాలు ప్రతియేటా జరుపుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా వినోద్‌కుమార్

షాద్‌నగర్: బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా షాద్‌నగర్‌కు చెందిన జటావత్ వినోద్‌కుమార్‌ను బుధవారం పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్య పరుస్తానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి అఖండ మెజార్టీ అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. తాను చేస్తున్న సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం జిల్లాస్థాయి పదవి ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహ్మారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా శివాజీ

కేశంపేట: బీజేపీ యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా మండల కేంద్రానికి చెందిన శివాజీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డికి శివాజీ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో బీజేపీ పటిష్టతకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఉత్తమ సేవా పురస్కారం



అవార్డు అందుకుంటున్న ప్రభాకర్‌రెడ్డి

హయత్‌నగర్: మమత ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ వైస్ చైర్మన్ డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి 2024 ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ బుధవారం నగరంలోని ప్లాజా హోటల్‌లో నిర్వహించిన ఉగాది పురస్కారాలలో భాగంగా జస్టిస్ సుధా పెరుగు, హైకోర్టు న్యాయమూర్తి పొన్నూరు మదన్‌మోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తాను చేస్తున్న సేవలను గుర్తించి విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ వారు అవార్డును అందించారని, దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. సీఈఓ సత్యవోలో రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గుమ్మి రాంరెడ్డి, రవిచరణ్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కందుకూరు: పులిమామిడిలో సీతారాముల కల్యాణ ఘట్టంలో మంగళసూత్రం చూపిస్తున్న పూజారి



మీర్‌పేట: రాఘవనగర్ కాలనీలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నియోజక వర్గంలోని ఆయా మండల పరిధిలో, వివిధ గ్రామాల్లో శ్రీరామ నవమిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి శివసాయినగర్ కాలనీలోని లక్ష్మీగణపతి దేవాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా రెడ్డి హాజరయ్యారు. జిల్లెలగూడలో కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, మాధరి సురేఖ, వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, హనుమాన్ దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని రామాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు. వేదపండితులు శాస్త్రబద్ధంగా సీతారాముల కల్యాణతంతు జరిపించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



మీర్‌పేట: శివసాయినగర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



తుక్కుగూడలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా రెడ్డి



కందుకూరు: కొత్తగూడలో కల్యాణం చేస్తున్న వేద పండితులు



మీర్‌పేట: మీర్‌పేట హనుమాన్ దేవాలయంలో కల్యాణంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



హుడాకాంప్లెక్స్: రామాలయంలో ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, తీగల కృష్ణారెడ్డి



పహాడీషరీఫ్: దాసాంజనేయ స్వామి ఆలయలో ఎర్ర కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు శివకుమార్



నాదర్‌గుల్‌లో బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు



మహేశ్వరం: నాగారంలో సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్ దంపతులు



సరూర్‌నగర్‌లో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి

ఆకట్టుకున్న వీధి నాటకం



నక్కలపల్లిలో నాటక ప్రదర్శనలో పాల్గొన్న గౌరీ సతీశ్ తదితరులు

మొయినాబాద్‌రూరల్: కంప్యూటర్ యుగంలో గ్రామాల్లో నేటికీ వీధి నాటకాలతో ప్రజలను కనువిందు చేయడం ఎంతో అభినందనీయమని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో భక్త మార్కండేయ విలాసం వీధి నాటకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నాటకాన్ని నేర్పించిన పంతులు మాసుల నర్సింహులు వివిధ వేషాధారణలు, మారుతీ మతిదేవి, మార్కండ మహారుషి, శంకరుడు వివిధ వేషాల్లో నాటకాన్ని ప్రదర్శించారు. ఈ వీధి నాటకాన్ని చూడడానికి చుట్టూ పక్కల గ్రామాల నుంచి వేలాది మంది తరలివచ్చి కనువిందు అయ్యారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు దర్శన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానయ్య, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, అంజయ్యగౌడ్, రాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం కార్యవర్గ సభ్యుడిగా హరికృష్ణ



బోడ హరికృష్ణ

పహాడీషరీఫ్: భారతీయ జనతా పార్టీ యువమోర్చా రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీకి చెందిన బోడ హరికృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు టి యాదయ్య నియామక పత్రం అందజేశారు. అనంతరం హరికృష్ణ మాట్లాడుతూ బీజేపీలో కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. యువత సమస్యలపై పోరాడుతూ పార్టీ బలోపేతం కోసం పని చేస్తానన్నారు. లోక్‌సభ ఎంపీ అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తానన్నారు.

బీఆర్ఎస్ సమన్వయకర్తగా రాజావరప్రసాద్

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ప్రతి నియోజకవర్గానికి సమన్వయకర్తలను నియమిస్తోంది. ఈ మేరకు నారాయణపేట నియోజకవర్గానికి సమన్వయకర్తగా షాద్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నేత, రాష్ట్ర సహకార సంఘం మాజీ చైర్మన్ రాజావరప్రసాద్‌ను నియమిస్తూ బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజావరప్రసాద్ మాట్లాడుతూ..పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



మొరం పోయిస్తున్న స్థానికులు

కొందుర్గు: కంకల్ రోడ్డు నుంచి తుమ్మలపల్లి గ్రామం వరకు రోడ్డుకిరువైపులా మరమ్మతు పనులు చేపట్టారు. రోడ్డు పక్కన గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని గమనించిన తుమ్మలపల్లి గ్రామస్తులు అబ్దుల్ అజీజ్, బంగారు రాములు, వడ్ల బ్రహ్మయ్య, మాణిక్యారావు ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడి అందరు కలిసి మూడు కిలోమీటర్ల పొడవు రోడ్డు బాగుచేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారిని అభినందించారు.



దర్గా వద్ద గంధం సమర్పిస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

ఆమనగల్లు: పట్టణంలో హజ్రత్ సయ్యద్ జలాలుద్దీన్ షావలి గంధోత్సవాన్ని మంగళవారం రాత్రి ముస్లిం నాయకులు,యువకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సయ్యద్ ఖలీల్, మహ్మద్ మోజం, మహ్మద్ జహంగీర్‌ల ఇంటి నుంచి గంధోత్సవం బయలుదేరింది. అనంతరం స్థానిక పట్టణంలోని ప్రధాన వీధుల నుంచి గంధోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతర ఇమామ్ మౌలానా అబ్దుల్ వాహెర్ ఆధ్వర్యంలో ప్రత్యేక దువా, ప్రార్థనలు నిర్వహించి గంధాన్ని సమర్పించారు. కార్యక్రమంలో వివిధ మసీదు కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మాసూం, ఖాదర్‌ఖాద్రి, నాయకులు అలీబేగ్, బాబా షర్ఫుద్దీన్, చాంద్‌పాషా, అబ్దుల్ జబ్బార్, నయీం, జలాల్, షేక్ అహ్మద్, షఫీ ఉల్లా, మహబూబ్ ఖురేశ్, హమీద్, అలీం, అబ్బాస్, ఇస్మాయిల్, అబ్బు, జానీపాషా, నయీం పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడంలో ఎంతో సంతృప్తి

యాచారం: పేదలను ఆర్థికంగా ఆదుకోవడం, సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యులు కొర్ర జ్యోతినాయక్ పేర్కొన్నారు. గ్రామంలో రమావత్ శోభ, నరేందర్ దంపతుల కూతురు దివ్య వివాహం గురువారం జరగనుంది. దీంతో దివ్య వివాహనికి బుధవారం కొర్ర జ్యోతినాయక్ క్వింటాల్ బియ్యం, ఒక పట్టు చీర అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర అరవింద్‌నాయక్, నాయకులు కడారి యాదయ్య, తారసింగ్, అఖిల్‌ఖాన్, శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బియ్యం, చీర అందజేస్తున్న ఎంపీటీసీ జ్యోతినాయక్ తదితరులు

సోలిపూర్‌లో బయోమైనింగ్ యంత్రాల ఏర్పాటు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: చెత్త సమస్య పరిష్కరించేందుకు మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామంలో బయోమైనింగ్ యంత్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలో వేస్తుండటంతో ఎన్నో ఏళ్లగా ప్రజలు ఆరోగ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. చెత్త సమస్యను పరిష్కరించేందుకు రాంకీ సంస్థ సహకారంతో డంప్‌యార్డు వద్ద రూ.2కోట్ల 50లక్షలతో బయోమైనింగ్ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చెత్తను సెగ్రసీ ప్రాసెస్ ద్వారా అన్ని వ్యర్థాలను వేరు చేసి రీసైక్లింగ్ చేసి మళ్లీ ఉపయోగపడే విధంగా తయారు చేయొచ్చని తెలిపారు. దీంతో మున్సిపాలిటీకి కూడా ఆదాయం వస్తుందని, ప్రతిరోజు ఈ యంత్రంతో 50 టన్నుల చెత్తను శుభ్రం చేయొచ్చన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చెత్త డంప్‌యార్డు స్థలాన్ని మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపల్ పాలకవర్గం గత ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు చేయాలని ఉన్నా, పాలన పరంగా వారికి ఇబ్బందులు ఎదురయ్యాయని విమర్శించారు. అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరు కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. అదేవిధంగా షాద్‌నగర్ జూన్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు పంపిణీ చేస్తామన్నారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన బుద్ధి చెబుతామన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు చేసుకున్న చీకటి ఒప్పందాలను ప్రజలను గమనిస్తున్నారన్నారు. ఆ రెండు పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణవేణి, శ్రీశైలం గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, అందె మోహన్, నెహ్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో వసతులు కల్పించాలి

డీటీ సంతోశ్

తలకొండపల్లి: మండలంలో ఎంపిక చేసిన 39 పోలింగ్ బూత్ సెంటర్‌ల్లో మౌలిక వసతులు కల్పించాలని టీడీ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో బీఎల్‌ఓలకు సూచించారు. మంచినీటి వసతి, టాయిలెట్లు, కరెంట్, తదితర కనీస అవసరాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, మండలంలో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులు కలిసి సుమారుగా 500 మంది ఉన్నారని, వీరందరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలని గుర్తించినట్లు చెప్పారు. వీరందరికీ 12డి ఫామ్‌ను పంపిణీ చేశామని, పూర్తి చేసిన ఫామ్‌లను 20 లోగా అందించాలన్నారు.

భక్తులకు తాగునీరు పంపిణీ

మాడ్గుల: మండలంలోని ఇర్విన్ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం శిరుసనగండ్ల సీతారామ చంద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దళపతి గౌడ్, దేవాదాయ కమిటీ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఇర్విన్, చారగొండ వెళ్లే రహదారిపై చలివేంద్రం ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచితంగా తాగునీరు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండలో దర్శనానికి వెళ్లే భక్తుల దాహార్తి తీర్చడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు సమీర్, గ్రామస్తులు యాదయ్య, శంకర్, శ్రీనివాస్, రామచంద్రయ్య, శివ, పవన్, కొండయ్య, మోక్ష, తదితరులు పాల్గొన్నారు.



తాగునీరు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు